సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం, 23, ఆగస్టు, 2022



స్పందనకు హాజరు కాకుంటే చర్యలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- 90 అర్జీలు స్వీకరణ

2లో

పదేళ్ల కృషి.. సాగు ఖుషీ

- ఉప్పునీటిని మంచి నీరుగా మార్చిన రైతు సూరిబాబు
- వ్యవసాయంపై మొగ్గుచూపుతున్న రైతులు



సెంటర్‌స్ప్రెడ్‌లో..



భవితతో భరోసా

- ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రత్యేక శిక్షణ, వైద్యం
- భవిత కేంద్రాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

న్యూస్‌రీల్

24, 26 తేదీల్లో ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు

సాక్షి, పాడేరు: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మానవీయ విలువలు, పర్యావరణ విద్య పరీక్షల్లో ఫెయిలైన, గైర్హాజరైన విద్యార్థులకు ఈ నెల 24,26వ తేదీల్లో మళ్లీ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎం.వినోద్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న మానవవీయ విలువలు, 26న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు అరకు క్రీడాపాఠశాల విద్యార్థి



ఎంపికైన కమిడి సూర్య

అనంతగిరి: షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన కమిడి సూర్య ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నాడు. యూత్ గేమ్స్ కౌన్సిల్ ఇండియా నేతృత్వంలో అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 26 నుంచి 30వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు అండర్ 14 విభాగం సింగిల్స్‌లో సూర్య ఎంపికయ్యాడు. అరకువేలి క్రీడా పాఠశాల నుంచి ఎంపికైనట్టు కోచ్ రాజబాబు తెలిపారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు గిరిజన విద్యార్థుల ఎంపిక



పతకాలు సాధించిన మహేశ్వరి, అశోక్, రఘుబాబు

కొయ్యూరు: కుస్తీలో గిరిజన బాల బాలికలు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 19 నుంచి 21 వరకు తిరుపతి జిల్లా గూడూరులోని నాయుడుపేట పాఠశాలలో రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించారు. స్థానిక కుస్తీ అకాడమీ నుంచి పాల్గొన్న జె.మహేశ్వరి 53 కిలోల విభాగంలో, జి.అశోక్ 63 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. 57 కిలోల విభాగంలో కె.రఘుబాబుకు రజతం, వంతల శ్రీనుకు కాంస్యం లభించాయి. బంగారు పతకాలు సాధించిన మహేశ్వరి, అశోక్‌లు వచ్చే నెలలో కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కుస్తీ అకాడమీ నిర్వాహకుడు అంబటి నూకరాజు తెలిపారు.

గిరిజనులు త్యాగధనులు

- స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి స్ఫూర్తి చిరస్మరణీయం
- దేశం గర్వించేలా ధైర్య సాహసాలు
- తిరుగుబాటుకు చింతపల్లి వేదిక కావడం గర్వకారణం
- కేంద్ర మంత్రి అర్జున్ ముండా
- ఘనంగా అల్లూరి రంప తిరుగుబాటు శతాబ్ది వేడుకలు



గిరిజన సంప్రదాయ నృత్యాలను తిలకిస్తున్న కేంద్ర మంత్రులు అర్జున్‌ముండా, కిషన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ తదితరులు

చింతపల్లి: స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు త్యాగాలు మరువలేనివని కేంద్ర మంత్రి అర్జున్ ముండా అన్నారు. చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడిచేసి వందేళ్లు అయిన సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో అల్లూరి రంప తిరుగుబాటు శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజుతో కలిసి ఈ ప్రాంత గిరిజనులు ప్రాణాలు అర్పించారని, వారి త్యాగాలకు దేశం గర్విస్తోందన్నారు. ఇంతటి పుణ్యభూమిలో పుట్టిన గిరిజనుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ తెలియాలన్నారు. భీమవరంలో జరిగిన అల్లూరి విగ్రహ ఆవిష్కరణలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ



నృత్యం చేస్తున్న గిరిజన కళాకారులు

గాం గంటందొర మనవడు బోడిదొరను సత్కరించి, పాదాభివందనం చేయడం గిరిజనుల అదృష్టంగా భావించాలన్నారు. అల్లూరి తిరుగుబాటుకు చింతపల్లి వేదిక కావడం గర్వకారణమన్నారు.

ఏజెన్సీ అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి : డిప్యూటీ సీఎం రాజన్న దొర



స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల త్యాగాలు మరువలేనివని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. అమరుల త్యాగాలు వృథా కానివ్వకుండా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. గాం గంటందొర, మల్లుదొర, బోనంగి పండుపడాల్, తగ్గి వీరయ్యదొర తదితర గిరిజనులు స్వాతంత్ర్య

మిగతా 2వ పేజీలో ▶

సినిమా చూసి చరిత్ర తెలుసుకున్నా : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హీరో కృష్ణ నటించిన సినిమా చూసి అల్లూరి సీతారామరాజు చరిత్ర తెలుసుకున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తి చరిత్రలో నిలిచిపోయేలా చర్యలు చేపడతామని చెప్పారు. తాజంగిలో రూ.33 కోట్లతో గిరిజన ఉద్యమకారుల మ్యూజియాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. అల్లూరి నడియాడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్

- సీహెచ్‌వో హోదా కల్పించడంపై హర్షం
- వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీహెచ్‌వోలు

సాక్షి, పాడేరు : డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పని చేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) హోదా కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన సీహెచ్‌వోలు పాడేరు ఐటీడీఏ ఎదుట సోమవారం థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి వారంతా కృతజ్ఞతలు తెలిపారు. థ్యాంక్యూ సీఎం సార్ నినాదాలతో ఐటీడీఏ ప్రాంగణం హోరెత్తింది. అనంతరం సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వోల సంఘ ప్రతినిధులు పట్నాల దుర్గా భవానీ, కూడా అమూల్య జ్యోత్స్నరాణి, సమరెడ్డి చంద్రకళ, శరబ ఉదయశ్రీ, ఓలేసు మధుసూదన్ రాజు, పట్నాల స్వాతి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఐదుగురు ఎంపీడీవోలు

ఉత్తర్వులు అందజేసిన జెడ్పీ చైర్‌పర్సన్



ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట(విశాఖ దక్షిణ): జిల్లాలో కొత్తగా ఐదుగురు ఎంపీడీవోలను నియమించారు. వీరికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర సోమవారం ఉత్తర్వులు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పని చేయడంవల్ల సర్వీసులో ప్రాధాన్యం లభిస్తుందని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే ప్రజల మన్ననలు పొందుతారని తెలిపారు. జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ మాట్లాడుతూ విధినిర్వహణలో అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఎంపీడీవోలుగా నియమితులైన కాండ్రేగుల కిరణ్‌కుమార్, హర్షిత రాజాం, వెంకటేష్ చీపురుపల్లి, కొండపూడి సాయి నవీన్,రాపేటి లోహిత జయ సాగర్‌లకు చైర్‌పర్సన్ ఉత్తర్వులు అందజేశారు.

క్లుప్తంగా...

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకులు జాహ్నవి



రికార్డులు పరిశీలిస్తున్న జాహ్నవి

చింతపల్లి: మన్యంలో మాతాశిశు మరణాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మేడిద జాహ్నవి అన్నారు. స్థానిక సీహెచ్‌సీని ఆమె సోమవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న గర్భిణులు, బాలింతలు వివరాల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ ఉన్న గర్భిణుల వసతిగృహం సేవలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రసవానికి 15 రోజుల ముందుగానే గర్భిణులను ఇక్కడకు తీసుకువచ్చేందుకు ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. సరైన పోషక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్, సీహెచ్‌సీ డిప్యూటీ సివిల్‌సర్జన్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందనకు హాజరు కాకుంటే చర్యలు : ఐటీడీఏ పీవో

రంపచోడవరం: ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే హెచ్చరించారు. ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం ఏడు మండలాల సెక్టార్ అధికారులతో సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం, ఏపీవో సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో మారుమూల గ్రామాల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు స్పందన కార్యక్రమంలో అందుబాటులో ఉండాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐసీడీఎస్ శాఖకు సంబంధించి పాలు, చెక్కీలు, గుడ్లు ఆహార పదార్థాలకు సంబంధించిన రికార్డులు సమర్పించాలని ఆదేశించారు.

స్పందనలో 90 అర్జీలు : పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించారు. స్పందనకు 90 అర్జీలు వచ్చినట్టు పీవో తెలిపారు. లంకపాకలు-యార్లమామిడి మధ్యలో డోకుల మామిడి వాగుపై కల్వర్టు నిర్మాణం, వేములకొండ నుంచి దార్లవలస వరకు తారురోడ్డు ఏర్పాటు చేయాలని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి,ఎంపీటీసీలు తుర్రం వెంకటేశ్వర్లుదొర, బచ్చల మంగ కాలుం చిన్నలదొరలతో కలిసి పీవోను కోరారు. ఏపీవో శ్రీనివాసరావు, ఈఈ డేవిడ్‌రాజు, ఏపీడీ వెలుగు ఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజనులు త్యాగధనులు

▶ 1వ పేజీ తరువాయి

ఉద్యమంలో పాల్గొనడం గర్వించదగ్గ విషయమన్నారు. వారి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు.

మా ప్రాంత అభివృద్ధికి కృషి చేయండి : ఎంపీ మాధవి



స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన మా ప్రాంత అభివృద్ధికి కేంద్ర మంత్రులు కృషి చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. ఉద్యమంలో పాల్గొన్నవారి కుటుంబాలు దయనీయ స్థితిలో ఉన్నాయన్నారు. వారికి ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు క్షత్రియ సేవాసంఘం ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అల్లూరి పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా మార్మోగుతోందని, అందులో మన గిరిజనుల కూడా భాగస్వామ్యులు కావడం గర్వంగా ఉందన్నారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవంతో గుర్తింపు : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



గిరిజన ప్రాంతం పేరు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. అల్లూరి సీతారామరాజు తెలుగువాడి పౌరుషాన్ని బ్రిటీష్ వారికి రుచి చూపించారని చెప్పారు. ముందుగానే చెప్పి మరీ పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి ఆయుధాలు ఎత్తుకెళ్లడం ఆయన ధైర్యానికి నిదర్శనమన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశమంతా అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించడంతో మన ప్రాంతానికి మరింత గుర్తింపు వచ్చిందన్నారు. ఈ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గాం గంటం దొర మనువడు బోడి దొరని కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఘనంగా సత్కరించారు. వారి వారసులుగా ఉన్న 11 మంది కుటుంబాలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రూ.2 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంప చెరువుని అభివృద్ధి చెయ్యడంతో పాటు అల్లూరి దాడి చేసిన చింతపల్లి పోలీస్ స్టేషన్‌ని పర్యాటక ప్రాంతగానూ, అల్లూరి సేదతీరిన మంప చెరువుని ప్రాంతాన్ని, రాజేంద్రపాలెంలో అల్లూరిని చెట్టుకు కట్టి బ్రిటిషర్లు చంపిన ప్రాంతాన్ని టూరిస్ట్ ప్రదేశంగా, 1916లో లంబసింగి రోడ్డుకు శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని మాన్యుమెంట్‌గా అభివృద్ధి చేసే పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ కరణం సత్యనారాయణరాజు ఆంగ్లంలో రచించిన లెజండరీ అల్లూరి శ్రీరామరాజు పుస్తకాన్ని కేంద్ర మంత్రులు ఆవిష్కరించారు.



బోడి దొర కుటుంబ సభ్యులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, కిషన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, కళావతి, కలెక్టర్ సుమిత్ కుమార్ తదితరులు

భారీగా తరలివచ్చిన గిరిజనులు

చింతపల్లిరూరల్/చింతపల్లి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన అల్లూరి రంప తిరుగుటు శతాబ్ది ఉత్సవాలకు భారీగా గిరిజనులు తరలివచ్చారు. ముందుగా సేవా సంఘం సభ్యులు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహాన్ని కేంద్ర మంత్రులు, ఉపముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం అల్లూరి దాడి చేసిన పోలీస్ స్టేషన్ భవనాలను పరిశీలించారు. సభా వేదిక వద్ద ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. జోహార్ అల్లూరి నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. సమావేశం ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎస్పీ సతీష్‌కుమార్,చింతపల్లి అదనపు ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేక చర్యలు చేపట్టారు. సభకు వచ్చిన వారందరికీ భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కళావతి, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ సతీష్ కుమార్, జేసీ శివ శ్రీనివాసు, గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకులు జాహ్నవి, పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు, సబ్‌కలెక్టర్ అభిషేక్, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, ఎంపీపీ బాబూరావు,జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ దురియ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



బోడి దొరని సత్కరిస్తున్న కేంద్ర మంత్రులు అర్జున్‌ముండా, కిషన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి రాజన్నదొర, ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, కళావతి తదితరులు



అస్తమించేది భానుడే.. అల్లూరి పోరాట స్ఫూర్తి కాదు



అల్లూరి విగ్రహాన్ని కేంద్ర మంత్రి అర్జున్ ముండాకు జ్ఞాపికగా అందిస్తున్న దృశ్యం



ఉత్సవాలకు హాజరైన గిరిజనులు



లెజండరీ అల్లూరి శ్రీరామరాజు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు

‘ప్రేరణ’తో గిరిజన యువతకు ఉపాధి

అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

రంపచోడవరం: ప్రేరణ కార్యక్రమం ద్వారా గిరిజన యువతకు ఉపాధిఅవకాశాలుకల్పిస్తున్నట్టు రంపచోడవరం అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ తెలిపారు. స్వయం ఉపాధి శిక్షణ పొందిన గిరిజన యువతతో సోమవారం ఇక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం ద్వారా గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. నాగావళి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఎంపిక చేసిన వారికి 30 రోజులు హోంనర్సింగ్ కోర్సులో శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. వీరిని ఉద్యోగాల కోసం హైదరాబాద్ పంప్తామని, త్వరలో మరికొంత మందిని ఎంపిక చేసి రెండో బ్యాచ్‌గా శిక్షణ ఇస్తాయని తెలిపారు. ఏజెన్సీలో గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యోగంలో చేరిన యువతకు ఏ సమస్య వచ్చినా రెడ్‌క్రాస్ సొసైటీ, పోలీస్‌శాఖ అందుబాటులో ఉండి పరిష్కారానికి కృషి చేస్తాయని చెప్పారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

క్లుప్తంగా...

డోలిమోతతో గిరిజనుడు ఆస్పత్రికి తరలింపు



డోలిమోతతో జగ్గంరాజును తరలిస్తున్న గిరిజనులు

పెదబయలు : మండలంలోని మారుమూల గిన్నెలకోట పంచాయతీ నడిమివాడ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న తమర్బ జగ్గంరాజును అనే గిరిజనుడిని సోమవారం స్థానికులంతా డోలిమోతతో ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నాలుగు కిలోమీటర్ల దూరం వరకు జగ్గంరాజును డోలిమోతతో జి.మాడుగుల మండలం మద్దిగరువు వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి ప్రైవేటు జీపులో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి జగ్గంరాజుకు వైద్య సేవలు కల్పించారు.

హత్యకేసులో ముగ్గురి అరెస్టు

చింతూరు: ఈనెల 15న చింతూరు మండలం చట్టిలో జరిగిన వనమోజు ఫణి నాగేంద్రకుమార్(25) అనే యువకుడి హత్యకేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు చింతూరు సీఐ అప్పలనాయుడు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చింతూరుకు చెందిన నాగజగదీష్, నాగేంద్రకుమార్ స్నేహితులు. తన భార్యతో నాగేంద్రకుమార్ చనువుగా ఉండడం చూసిన జగదీష్ అతనిపై కక్ష పెంచుకుని హత్య చేయాలని పథకం వేశాడు. దీంతో జగదీష్ తన ఇద్దరు స్నేహితులైన దేవేంద్రకుమార్, రవికుమార్‌ల సహకారంతో ఈనెల 15న చట్టిలో నాగేంద్రకుమార్‌పై స్టీల్‌రాడ్డుతో తీవ్రంగా తలపై కొట్టి హతమార్చినట్టు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కశింకోట: కశింకోటలోని పొలాల వైపు శారదానది అవతల గుర్తు తెలియని పురుషుని మృతదేహాన్ని స్థానికుల సమాచారం మేరకు సోమవారం కనుగొన్నట్టు హెచ్‌సీ టి. అప్పలకొండ తెలిపారు. మృతుని శరీరంపై ఫ్యాంటు, షర్టు ఉన్నాయని బెల్టు పెట్టుకొని ఉన్నాడని అన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ప్రవాహానికి నదిలో కొట్టుకొని వచ్చినట్టు భావిస్తున్నామన్నారు. నదిలో తుప్పల్లో చిక్కుకొని ఉన్న మృతదేహాన్ని వెలికి తీయడానికి ప్రయత్నించగా, చీకటి పడడంతో ఈతగాళ్లు తీయడానికి ముందుకు రాలేదన్నారు. మృతదేహాన్ని వెలికి తీస్తే వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

గౌరీపట్నంలో పెయింటర్ ఆత్మహత్య

చోడవరం : గౌరీపట్నంలో ఒక వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కడిమి జగ్గారావు (32) తన ఇంట్లో ఫ్యాన్‌కి చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అంత వరకు అందరితో కలిసిమెలసి తిరిగిన జగ్గారావు ఆకస్మికంగా ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కి ఉరివేసుకోవడంతో భార్య, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం తరలించినట్టు చెప్పారు.

మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

పెదబయలు : మండలంలోని గిన్నెలకోట గెడ్డ దాటుతూ గెడ్డ ఉధృతిలో కొట్టుకునిపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, సీనియర్ నాయకులు గంపరాయి సూరయ్య అన్నారు. గిన్నెలకోట గ్రామానికి చెందిన మామ, కోడలు మనుగూరు లక్ష్మయ్య(45), సత్యవతి(28) ఈ నెల 21న మధ్యాహ్నం గిన్నెలకోట గెడ్డ దాటుతూ మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే.

ఆదివారం సాయంత్రం రెండు మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టడంతో గెడ్డ నుంచి మృతదేహాలు లభ్యమైనప్పటికీ చీకటి పడడంతో మృతదేహాల తరలింపు కష్టంగా మారింది. ఈ విషయం తెలిసిన వెంటనే అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఐటీడీఏ పీవో, వైద్య సిబ్బంది, పోలీసులను అప్రమత్తం చేయడంతో గిన్నెలకోట సమీపం వరకు అంబులెన్స్‌ను పంపించి అక్కడ నుంచి గుల్లేలు వరకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మరల గిన్నెలకోట గ్రామ సమీపం వరకు అంబులెన్స్‌లో తిరిగి మృతదేహాలను చేర్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నాయకులు చెప్పారు. గెడ్డపై వంతెన నిర్మాణానికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరయ్యాయని, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పనులు ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు గడుతూరు రామన్న పడాల్, చిన్నారావు, వీఆర్వో శ్రీను,గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌లో పాలవ్యాన్ బోల్తా

సాక్షి, పాడేరు : ఘాట్‌లోని వ్యూపాయింట్ దిగువ మలుపులో పాల వ్యాన్ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయి బోల్తా కొట్టిన సంఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. విశాఖ డెయిరీ నుంచి పాడేరు ప్రాంతానికి పాలు, పెరుగు, ఇతర సామాగ్రితో వస్తున్న వ్యాన్ ఈ మలుపులో అదుపు తప్పి వంద అడుగుల లోయలోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రామస్వామి, క్లీనర్‌లు శంకర్, సతీష్ తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ నిద్ర మత్తుతోనే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. వ్యాన్ బోల్తా కొట్టడంతో పాలు, పెరుగు ప్యాకెట్లు, రొట్టెలు, ఇతర సామాగ్రి అంతా చెల్లా చెదురుగా పడిపోయాయి. వ్యాన్‌లో రూ.5 లక్షల విలువైన సామాగ్రి ఉన్నట్టు విశాఖ డెయిరీ సూపర్‌వైజర్



ఘాట్‌లోని లోయలో బోల్తా కొట్టిన పాల వ్యాన్



లోయలో నుంచి బయటకు తీసిన పాలు, పెరుగు ప్యాకెట్లు

రాజు తెలిపారు. ఈ ప్రమాద సంఘటనపై పాడేరు పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందడంతో ఎస్ఐ లక్ష్మణరావు, ఇతర సిబ్బంది ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. సమీపంలోని రాజాపురం గ్రామానికి చెందిన గిరిజనులతో కలిసి డెయిరీ సిబ్బంది లోయలోకి దిగి చెల్లా చెదురుగా పడిన పాలు, పెరుగు ప్యాకెట్లు, ఇతర సామాగ్రిని కొంత మేర బయటకు తీయగలిగారు.

అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- 420 కిలోల గంజాయి స్వాధీనం
- లారీ, కారు, బైకు సీజ్

పెదబయలు : ముంచంగిపుట్టు మండలం నుంచి ఒడిశాలోని పాడువా వైపు లారీలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకుని ఆరుగురు అంతర రాష్ట్ర గంజాయి ముఠాను అరెస్టు చేశామని జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్ సోమవారం తెలిపారు. మత్స్యగెడ్డపై నిర్మించిన బ్రిడ్జి వద్ద తనిఖీలు చేయగా లారీలో 420 కిలోల గంజాయి వెలుగు చూసిందని వారు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీతో పాటు ఒడిశాకు చెందిన ఓ కారు, పల్సర్ బైకును కూడా ఈ గంజాయి కేసులో సీజ్ చేసామని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన



గంజాయి లారీ, నిందితులతో పెదబయలు పోలీసులు

సుభంసింగ్, బిట్టు కారా, ఒడిశాకు చెందిన బురిడి డమురు, ప్రశాంత్ బెహర, ముంచంగిపుట్టు మండలం బరడ గ్రామానికి చెందిన వంకెల కృష్ణ, పెదబయలు మండలం కుంతుర్ల పంచాయతీకి చెందిన కొర్ర కామేశ్వరరావులను అరెస్టు చేశామని వారు తెలిపారు.

ట్రాక్టరు బోల్తా.. డ్రైవరు మృతి

యలమంచిలి : మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా ట్రాక్టరు నడపడంతో వాహనం బోల్తా పడి డ్రైవరు మృతి చెందిన ఘటన యలమంచిలి మండలం పులపర్తి గ్రామంలో చోటు చేసుకుంది. యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలివి. పులపర్తి గ్రామంలో పులి సరోజకు చెందిన పొలాన్ని దున్నుతుండగా ఒక్కసారిగా ట్రాక్టరు అదుపుతప్పి సమీపంలో వున్న కొబ్బరిచెట్టును ఢీకొని బోల్తాపడింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు గాయపడిన ట్రాక్టరు డ్రైవరు సారిపల్లి అప్పలరాజు(41) ని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో మృతిచెందినట్టు తెలిపారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన ట్రాక్టరు (ఇన్‌సెట్) మృతుడు సారిపల్లి అప్పలరాజు

చట్టాలపై సినిమా థియేటర్లు, కేబుల్ టీవీల్లో ప్రచారాలు

ప్రధాన ప్రదేశాల్లో అవగాహన బోర్డులు



మాట్లాడుతున్న డీఎస్పీ ఎం.మహేశ్వరరావు

అనకాపల్లిటౌన్: చట్టాలపై ప్రధానంగా 8 వీడియోలు తయారు చేయడం జరిగిందని, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే విధంగా సినిమా థియేటర్లు, కేబుల్ టీవీల్లో ప్రచారం చేయడం జరుగుతుందని దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీస్ అతిథి గృహంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. దిశ యాప్‌ను జిల్లాలో సుమారుగా లక్ష యాప్‌లో డౌన్‌లోడు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా కోటి 8 లక్షల మంది సెల్‌ఫోన్లో లోడ్ చేశామన్నారు. 2020లో 40 కేసులు, 2012లో 105 కేసులు, 2022లో నేటి వరకూ 180 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. చట్టాలపై నేటి యువత అవగాహన పెంచుకోవడం వల్ల నేరాలను నిర్మూలించవచ్చని సూచించారు. జిల్లాలో ప్రధానమైన ప్రదేశాల్లో పలు చట్టాలపై ఫ్లెక్సీలు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దిశ స్టేషన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి మూడు ఆవులు మృతి

అనకాపల్లిటౌన్ : గవరపాలెం జాతీయ రహదారి గౌరీకాలనీల్లో సూరిశెట్టి తాతినాయుడు పశువుల శాలలో విద్యుత్ వైర్లుకు సోమవారం మూడు ఆవులు తగిలి అక్కడిక్కడే మృతి చెందాయి. ఈ సందర్భంగా తాతినాయుడు మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుని నష్టపరిహారం అందజేయాలని ఆయన కోరారు.

గాయపడిన ముళ్ల పంది జూకు అప్పగింత

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రహదారిపై గాయపడిన ముళ్ల పందిని జూకు అప్పగించారు. ఉక్కునగరం రహదారి పక్కన గాయపడి ఉన్న ముళ్ల పందిని సోమవారం కొందరు గమనించారు. వెంటనే ఆగ్రోఫారెస్ట్ విభాగానికి సమాచారం అందించారు. అనంతరం రాష్ట్ర అటవీ శాఖ సిబ్బంది సహకారంతో నగరంలోని జూకు అప్పగించారు. జూ సిబ్బంది దానికి అవసరమైన పరిచర్యలు చేసి రక్షించారు. వన్యప్రాణుల రక్షణ కోసం ఆగ్రోఫారెస్ట్ విభాగం సిబ్బంది తీసుకున్న చర్యలు అందరి ప్రశంసలు అందుకున్నాయి.



బ్యూటిఫుల్ పిక్చర్

రైవాడ జలాశయం పరిసరాలలో ప్రకృతి అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చుట్టూ కొండలు, దిగువున పచ్చని పంట పొలాలు. సుందర దృశ్యాలను చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. సోమవారం సాయంత్రం నింగిలోని నీలిమేఘాలు జలాశయంలో జలకాలాడుతున్నట్లు సాక్షాత్కరించింది.

-దేవరాపల్లి (మాడుగుల)



అమెరికాలో హిందూ సాంప్రదాయం ప్రకారం జరిగిన వివాహం

భవితతో భరోసా

- ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రత్యేక శిక్షణ, వైద్యం
- పిల్లల్లో మెరుగుపడుతున్న నైపుణ్యాలు
- భవిత కేంద్రాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం


పెందుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా..ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'ప్రత్యేకావస రాల' పిల్లల భవిష్యత్‌కు భరోసా కలుగుతోంది. భవిత కేంద్రాల్లో ఆయా పిల్లలకు ప్రత్యేక శిక్షణ, చికిత్స ద్వారా వారి సహజసిద్ధమైన నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నారు. వారి పనులు వారే చేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు. అయితే లోపాలు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం..భవిత కేంద్రాలు ఉన్నట్లు తగిన ప్రచారం చేయకపోవడం వలన పిల్లలను తీర్చిదిద్దే అవకాశాలు చేజారుతున్నాయి. ఒక్క పెందుర్తిలోనే దాదాపు 200 మందికి పైగా లోపాలు కలిగిన పిల్లలు ఉండగా నియోజకవర్గంలో ఆ సంఖ్య వెయ్యికి పైమాటే..కానీ భవిత కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న పిల్లల సంఖ్య కేవలం 70 మంది మాత్రమే. ప్రత్యేకావసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో సంప్రదించవచ్చు.



భవిత కేంద్రంలో ఆటలాడుకుంటున్న మానసిక, దివ్యాంగ పిల్లలు

లోపాలు ఇవీ.. శిక్షణ ఇలా..

- ముందుగా కేంద్రంలో చేరిన చిన్నారులను కొద్దిరోజుల పాటు నిపుణులు ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా పరిశీలించి వారి లోపాలను గుర్తిస్తారు.
- దృష్టిలోపం ఉన్నవారికి దృష్టి ప్రేరణ, బ్రెయిలీ లిపిపై అవగాహన కలిగిస్తారు.
- వినికిడి సమస్య ఉన్నవారికి నాలుక అంగుడికి మధ్య ప్రేరణ కలిగేలా తర్ఫీదు ఇస్తారు. కొవ్వొత్తులు ఊదించడం..బెలూన్లు ఊదడం..ఐస్ క్రీం తినిపించడం వంటివి ఇందులో భాగం. దీంతోపాటు ప్రత్యేక పరికరం ద్వారా వారి వినికిడి సమస్యను పరిష్కరించేందుకు చికిత్స అందిస్తారు.
- మానసిక సమస్యలు ఉన్న పిల్లలను ఏదైనా ఓ పని మీద ఆసక్తి కలిగేలా చేస్తారు. ఈ పిల్లల్లో త్వరగా మరిచిపోయే లక్షణం ఉంటుంది కనుక ఆ పని మీద ఆసక్తిని కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. తరచూ ఆటలను మారుస్తూ మానసిక స్థితిని కేంద్రీకృతం చేసేందుకు ప్రయత్నం చేస్తారు.
- లోపాలు గుర్తించి పిల్లలకు కేంద్రంలోనే శిక్షణ కాకుండా ఇంటి దగ్గర కూడా సాధన చేసే విదంగా భోదన చేస్తారు. తల్లిదండ్రులకు కూడా మెళకువలు నేర్పిస్తారు.
- పిల్లల లోపాలను బట్టి భవిత కేంద్రంలో కనీసం మూడు నెలలు గరిష్టంగా రెండేళ్లపాటు శిక్షణ, చికిత్స అందిస్తారు.
- పరిస్థితి మెరుగైనట్టు ఉంటే పిల్లలకు అందుబాటులో ఉండే పాఠశాలలో చేర్పించి సహిత విద్య అందించే ప్రయత్నం చేస్తారు.



పిల్లలకు మెళకువలు చెబుతున్న భవిత కేంద్రం నిర్వాహకురాలు శారద




భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు

'భవిత'లో ఇలా చేర్పించండి

- సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో పెందుర్తి, సబ్బవరం, పరవాడల్లో భవిత కేంద్రాలు నడుస్తున్నాయి. ఒక్కో కేంద్రంలో 20 మంది చొప్పున ప్రవేశాలు కల్పిస్తారు.
- నెలల చిన్నారి నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు అర్హులు.
- మిత వైకల్యం, అతి తక్కువ ఉన్న పిల్లలకు కేంద్రంలో ప్రతీరోజు శిక్షణ అందిస్తారు. తీవ్ర, అతి తీవ్ర వైకల్యం ఉన్నవారికి ఇంటి దగ్గరే తర్ఫీదు ఇస్తారు. లోపాలు ఉన్న పిల్లలతో పాటు తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్, గైడెన్స్ ఇస్తారు. తద్వారా ఇంటి నిపుణులు లేని సమయంలో కూడా పిల్లలకు తల్లిదండ్రులు శిక్షణ ఇచ్చుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకుల భావన.

అడ్మిషన్లు ఇస్తున్నాం



భవిత కేంద్రాల్లో పిల్లల పరిస్థితికి అనుగుణంగా శిక్షణ, చికిత్స అందిస్తున్నాం. పిల్లలందరూ చక్కాగా స్పందిస్తున్నారు. కనీసం వారి పనులు వారు చేసుకునేలా తీర్చిదిద్దడమే మా కర్తవ్యం. అయితే చాలామంది తల్లిదండ్రులు ఇక్కడి కేంద్రంపై అవగాహన లేక బయట ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ చేరే పిల్లలకు నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్/పింఛన్‌తో పాటు గార్డియన్‌కు బస్‌పాస్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. తమ పిల్లలను చేర్పించాలనుకునే వారు ఫోన్: 99122 39821 నంబర్లో సంప్రదించినా.. కేంద్రానికి వచ్చినా అడ్మిషన్ ఇస్తాం.

-ఎస్.శారద, భవిత కేంద్రం నిర్వాహకురాలు

ఉప్పునీటిని మంచి నీరుగా మార్చిన రైతు సూరిబాబు

వ్యవసాయంపై మొగ్గుచూపుతున్న రైతులు



పాత ము

తగరపువలస (భీమిలి):

భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ
చెందిన యువరైతు వెంపాడ సూరిబాబు పదే
కృషి ఫలించింది. తాటిపూడి రిజర్వాయర్ ను
చి గోస్తనీనది ద్వారా ఉప్పుగెడ్డలో కలుస్తున్న
నీటిని నిలువరించాడు. గోస్తనీనది నుంచి
మొదటి పాయ నేరుగా తగరపువలస జాతీయ

పట్టువదలని విక్రమా

పదోతరగతి చదువుకున్న సూరిబాబు తనకున్న మూడు ఎకరాలు, బంధువుల నుంచి కౌలుకు తీసుకున్న 17 ఎకరాలతో సాగు చేస్తున్నాడు. సాగునీటి కోసం వర్షాలపై ఆధారడమే కాకుండా కొండవాలులో కురిసిన నీటిని ఒడిసి పట్టి బావులలో నిల్వ చేస్తుంటాడు. అయినప్పటికీ సాగునీరు చాలకపోతుండటంతో గోస్తనీ నీటిని ఉప్పుగెడ్డలో కలవకుండా, సముద్రం నీరు ఆటుపోట్లతో నది నీటిలో కలపకుండా అడ్డుకట్ట వేయగలిగాడు. మట్టి, గ్రావెల్, పైపులు ఉపయో




అక్కడమ్మాయి.. ఇక్కడబ్బాయి

- **జర్మనీ యువతితో విశాఖ యువకుడి పెళ్లి**
- **మూడుముళ్లు వేసింది అమెరికాలో..**
- **ప్రేమించి..పెద్దలను ఒప్పించి వివాహం**

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ప్రేమకు కులం, మతం, భాష, ప్రాంతం వంటి బేధాలేవీ ఉండవు అంటారు. ఖండాంతరాలు దాటైనా ప్రేమను గెలిపించుకుంటున్నారు ప్రేమికులు. ఇవన్నీ వినడానికి సినిమా డైలాగుల్లా అనిపించొచ్చు.. కానీ అప్పుడప్పుడు రియల్ లైఫ్ లోనూ ఇలా జరుగుతుంటాయి. తాజాగా ఓ జంట ప్రేమ ఖండాంతరాలు దాటింది. విశాఖ అబ్బాయి..జర్మనీ అమ్మాయిని ప్రేమించి పెద్దలను ఒప్పించి ఒక్కటయ్యారు.

ఇక్కడ విశేషమేమిటంటే..మూడు దేశాల సంబంధంతో ఓ జంట ఒక్కటయ్యింది. వివరాల్లోకి వెళ్తే..విశాఖలోని కళాసాగర్ అధినేత వానపల్లి శ్రీమన్నారాయణ కుమారుడు దైవిక శశాంక్, జర్మనీకి చెందిన లిండా ముల్లర్ ప్రేమించుకున్నారు. ఈ విషయం



పెద్దలకు చెప్పడం..వాళ్లు అంగీకరించడంతో ఇటీవల వీరి వివాహం అమెరికా (అమ్మాయి, అబ్బాయి అక్కడ పనిచేస్తున్నారు)లో అంగరంగ వైభవంగా..హిందూ సంప్రదాయం ప్రకారం జరిగింది. అబ్బాయిది (విశాఖ),అమ్మాయిది(జర్మనీ), పెళ్లయ్యింది అమెరికాలో.. ఫలితంగా ఈ వివాహ బంధం మూడు దేశాలతో ముడిపడినట్టయ్యింది.

మీకు తెలుసా? జీబ్రాలు నిలబడే నిద్రపోతాయి



విశాఖపట్నం: జంతువులు అన్ని రంగులను ఆసక్తిగా చూస్తుంటాయి. వాటి చూపును బట్టి ఆయా రంగులను గుర్తిస్తున్నాయని మనం భావిస్తాం. జీబ్రాలు మాత్రం పచ్చని రంగును గుర్తించలేవట. కానీ ఒకేసారి వాటి కంటితో రెండు దృశ్యాలను చూడగలవట. ఈ విషయం వన్యప్రాణుల సంరక్షణ చేసేవారికి మాత్రమే తెలుస్తుంటుంది. ఇంకా వాటి గురించి తెలుసుకోవాల్సిన ఆసక్తిగల విషయాలు ఉన్నాయండోయ్.. జీబ్రాలు అడవుల్లో సుమారు 1,000 వరకు గంపులుగా తిరుగుతాయి. అవి గంటకు 40 కిలోమీటర్లు వేగంతో పరుగెత్తుతాయి. ఇవి తిన్నగా కాకుండా అడ్డదిడ్డంగా పరుగెడుతాయట. అందుకే వేటగాళ్లకు ఇవి దొరకవట. ఒకవేళ వేటగాళ్లుగానీ, హైనా, సింహం తదితర క్రూర మృగాలుగానీ వాటిని వేటాడినప్పుడు వెనుక కాళ్లతో తన్ని వాటిని అవే రక్షించుకొంటాయి. పిల్ల జీబ్రా కూడా పుట్టిన గంటకు పరుగెడుతుందట. వీటిలో మరో విశేషమేమంటే ఇవి నిలబడే నిద్రపోతాయి. ఏ రెండు జీబ్రాలకు వాటి శరీరంపై ఉన్న చారలు ఒకేలా ఉండవు. ఇవి వాటిపై దాడిచేసే క్రూర మృగాలను తికమకపెడతాయట.

పదేళ్ల కృషి సాగు ఖుషీ



...మూలకుద్దు వద్ద ఉప్పునీటి స్థానంలో నిండుగా కనిపిస్తున్న మంచినీరు

రహదారి వంతెన కింద నుంచి గుడివాడ, చిట్టివలస మీదుగా ఉప్పుటేరులో కలిసిపోగా, రెండవ పాయ మజ్జివలస, తాటితూరు మీదుగా పోలిపల్లి కాలువ ద్వారా పాత మూలకుద్దు, చిప్పాడ పంచాయతీల మీదుగా ప్రవహిస్తోంది. ఇది చెరకుపల్లి– దివీస్ రోడ్డులో మూలకుద్దు, చిప్పాడ పంచాయతీల నడుమ ఉప్పుగెడ్డ వంతెన వద్ద ఉప్పునీటిలో కలిసిపోతోంది. సముద్రంలో రోజుకు రెండుసార్లు సంభవించే ఆటుపోట్లు కారణంగా సిటీనగర్‌ను ఆనుకుని ఉన్న దేవరమెట్ట నుంచి తగరపువలస వైపు ఉన్న రెండు పాయల వైపు బోరుబావులు, నదులు ఉప్పుగా మారిపోయాయి. ఫలితంగా పంట పొలాలు చౌడుగా మారిపోయాయి. ఈ ప్రాంతంలో వేసిన లే ఔట్లులో ఉప్పునీరు పడటంతో నివాసానికి పనికిరాకుండా పోయాయి.

మట్టితో చెక్‌డామ్‌ల నిర్మాణం..



సిటీనగర్ దేవరమెట్ట వద్ద నిర్మించిన మట్టి చెక్‌డ్యామ్

స్వతహాగా రైతు అయిన వెంపాడ సూరిబాబు పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నాడు. చిప్పాడ కొండవాలు ప్రాంతంలో ఉన్న తన వ్యవసాయ భూములు పదేళ్ల క్రితమే ఉప్పునీటి కారణంగా చౌడువారిపోయాయి. మరో రైతు అయితే వ్యవసాయం మానుకుని వెన్నుచూపేవాడే. కానీ సూరిబాబు కొండ ప్రాంతంలో కురిసిన వర్షం నీటికి కందకాలు తవ్వి సాగుకు అవసరమయ్యే నీటిని బావులలో నిలువ చేసుకోగలిగాడు. అప్పట్లో సూరిబాబు ప్రయత్నాన్ని చూసి నవ్వుకున్నవారే ఇప్పుడు ఆయన ఉప్పునీటి కోరల్లో చిక్కకుండా మంచినీటిని పరిరక్షించిన విధానాన్ని చూసి అభినందిస్తున్నారు. ఉప్పుగెడ్డకు చేరువలో చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల నడుమ, దేవరమెట్ట గ్రామ సచివాలయానికి చేరువలో రెండు చోట్ల మట్టి, సిమెంట్ పైపులు వినియోగించి కొంచెం ఎత్తులో చెక్‌డ్యామ్‌లు నిర్మించాడు. దీంతో ఆటుపోట్ల ద్వారా ఉప్పునీరు ఎగువకు చేరకుండా, గోస్తనీనీరు దిగువకు చేరకుండా నిరోధించగలిగాడు. రెండేళ్లుగా సొంత ఖర్చుతో చేస్తున్న ప్రయోగం కారణంగా మూలకుద్దు, చిప్పాడ పంచాయతీలలో వ్యవసాయబావులు, బోరు బావులలో నీరు ప్రస్తుతం చప్పగా మారిపోయింది. చౌడువారిన భూములు మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. లే ఔట్లలో ప్రస్తుతం చప్పనీరు లభిస్తుంది. గతంలో నిలిచిపోయిన వ్యవసాయం మళ్లీ ఊపందుకోనుంది.

...ర్కుడిలా..

...గించిన చేసిన ప్రయత్నం మూడు సార్లు విఫలమయినా నాలుగోసారి విజయం సాధించాడు. దీనికి సూరిబాబు రూ.5లక్షల వరకు ఖర్చు చేశాడు. తాను ప్రయోజనం పొందడమే కాకుండా తోటి రైతులకు మేలు చేయగలిగాడు. చిప్పాడ పంచాయతీలో 300 ఎకరాల వరకు కొబ్బరి, నీలగిరి, అరటి, చోడి, ఉలవలు సాగు చేస్తుంటారు. గతంలో ఉప్పునీరు కారణంగా పంటలకు స్వస్తి చెప్పిన రైతులు మళ్లీ పంటలవైపు మొగ్గు చూపుతున్నారు.

మూడు సార్లు విఫలమయ్యా



గోస్తనీనది నుంచి నీరు ఉప్పుగెడ్డలో కలవకుండా చేసేందుకు మూడు సార్లు ప్రయత్నించి విఫలమయ్యా. ఏడాది క్రితం నుంచి ఈ ప్రాంతంలోని భూములలో నీటి రుచి మారుతూ వస్తోంది. ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు ఖర్చయింది. గతంలో ఉప్పుగా ఉన్న చోట నీరు ఇప్పుడు మంచినీరుగా వస్తోంది.

–వెంపాడ సూరిబాబు, చిప్పాడ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, భీమిలి మండల

300కు పైగా బోర్లలో మంచినీరు..



గతంలో ఉప్పునీరు, కలుషితమైన నీటితో నిండిపోయిన తాగునీటి, సాగునీటి బావులలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో 300 పైగా బోర్లలో మంచినీరు చేరింది. చౌడువారిన తోటపంటలు జీవం పోసుకుంటున్నాయి. మళ్లీ చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల రైతులు వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు.

–సరగడ రాంబాబు, చిప్పాడ

ప్రభుత్వం చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి..



ఉప్పునీరు ఎగువకు చేరకుండా ప్రభుత్వం లేదా ఇక్కడి వనరులు వినియోగించుకుంటున్న దివీస్ యాజమాన్యం శాశ్వత ప్రయోజనాల కోసం చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. కొండలపై కురిసిన నీరు కూడా నిల్వ చేయవచ్చు. ఇలా చేస్తే ఏడాది పొడవునా తాగు, సాగునీరు ఇక్కడి ప్రజలకు సరిపోతుంది.

–కొసన ఈశ్వరరావు, చిప్పాడ

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఓం నమః శివాయ నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

వైభవంగా నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా చేశారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

టవర్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

● మండలానికి 100 బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు మంజూరు
● టెలీకాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు కిరణ్

కొయ్యూరు: అరకు ఎంపీ గొడ్డేటి మాధవి చొరవతో మండలానికి వంద బీఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరైనట్టు టెలీకాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు నర్సి కిరణ్ చెప్పారు. ఈ మేరకు స్థలాలు గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఎ.మాకవరం, లుభుర్తి, నడింపాలెం ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు బీఎస్ఎన్ఎల్ అధికారులు శ్రీకాంత్ పట్నాయక్, వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ గడచిన నాలుగు రోజుల నుంచి టవర్లకు అవసరమైన స్థలాలను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులతో గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 22 పంచాయతీల్లో టవర్లకు అనువైన స్థలాలను గుర్తించినట్టు చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. అరకు ఎంపీ మాధవి దృష్టికి గతంలో టవర్ల కొరత మూలంగా మారుమూల ప్రాంతాల్లో పడుతున్న ఇబ్బందులను గుర్తించామన్నారు. దీంతో ఆమె చొరవ తీసుకుని వాటిని మంజూరు చేయించినట్టు చెప్పారు.



సెల్ టవర్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న బీఎస్ఎన్ఎల్ అధికారులతో, కిరణ్

ఘాట్‌రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీసుశాఖ చర్యలు

సాక్షి, పాడేరు: పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే ప్రధాన ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ సుధాకర్, ఎస్ఐలు జి.లక్ష్మణరావు, రంజిత్‌లు హెచ్చరిక బోర్డుల ఏర్పాటుపనులు చేయిస్తున్నారు. పాడేరు నుంచి గరికబంద చెక్‌పోస్టు వరకు ప్రమాదకర మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. విశాఖపట్నంలోని వెంకటరమణ కార్పొరేట్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటుచేసిన బోర్డుల్లో వాహనచోదకులు, ప్రయాణికులకు తగిన రక్షణ చర్యలను సూచిస్తున్నారు. దీంతో వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేశారు.



వ్యూపాయింట్ సమీపంలోని మలుపు వద్ద పోలీసు శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం



మహిళలకు పసుపు, కుంకుమ అందజేస్తున్న రొబ్బి చిన్న దంపతులు

సాక్షి, పాడేరు : స్థానిక ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళ గౌరీ వ్రతాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమానీలకంఠేశ్వర స్వామి విగ్రహాలకు రామం పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. వర్తక సంఘం నేత రొబ్బి చిన్న దంపతులు పూజల్లో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమ అందజేశారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, వర్తక సంఘం నేతలు శంకరరావు, రాము, మధు తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షల కోసం డీఈవోను సంప్రదించండి

చింతూరు: భారీ వర్షాలు, వరదల కారణంగా గత నెలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాయలేకపోయిన విద్యార్థులు జిల్లా విద్యాశాఖాధికారిని సంప్రదించాలని చింతూరు ఎంఈవో లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జులైలో నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి భారీ వర్షాలు, వరదల కారణంగా చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన విద్యార్థులు సైన్స్, సోషల్ పరీక్షలకు హాజరు కాలేక పోయారని ఆయన తెలిపారు. వీరందరికీ తిరిగి పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని, పరీక్షలు రాయలేక పోయిన విద్యార్థులంతా తనను సంప్రదించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు ఇచ్చినట్టు ఎంఈవో తెలిపారు.

లోకులగాంధీ సేవలు మరువలేనివి

కొయ్యూరు: గిరిజనులకు బీజేపీ నాయకుడు లోకుల గాంధీ చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. శరభన్నపాలెంలో లోకులగాంధీ ప్రథమ వర్ధంతి సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి సోము వీర్రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నడింపాలెంలో ఏర్పాటుచేసిన లోకులగాంధీ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం శరభన్నపాలెంలో గాంధీ స్మృతివనాన్ని ప్రారంభించారు. అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ ప్రతినిధులు సుధాకర్, వేణుగోపాల్, ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, పరుశ రామరామరాజు తదితరులు హాజరయ్యారు. వీర్రాజు మాట్లాడుతూ లోకులగాంధీ పార్టీ కోసం విశేష సేవలందించారన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో దాతలను అభినందించారు. కార్యక్రమంలో నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాఘవేంద్రరావు, గిరిజన మోర్చా నాయకులు సుప్రజ, అశోక్‌కుమార్, రాజు, బీజేపీ నాయకులు అర్జున్‌రెడ్డి, చంద్రరావు, లోకులగాంధీ కుటుంబ సభ్యులు లోకుల చంద్ర కిరణ్, ఈశ్వరరావు, రమేష్, ఎం.మురళీకృష్ణ, ఎం.మంగవేణి తదితరులు పాల్గొన్నారు.



నడింపాలెంలో లోకులగాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సోము వీర్రాజు, నేతలు

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 87 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠ ధర	గరిష్ఠ ధర
మొదటి రకం	3,710	4,000
రెండో రకం	2,900	3,000
మూడో రకం	2,250	2,500

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.51,930
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.47,600
వెండి(కిలో):	రూ.61,100

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

డుంబ్రిగుడ: అరకు సంబయలు గ్రామంలోని యూనిటీ ఫర్ చారిటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజన పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ శారద సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పేద విద్యార్థుల విద్యాభ్యున్నతికి ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకొని వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ సేవలను కొనియాడారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు సురేంద్ర, వైఎస్సార్‌సీపీ అరకు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీనాయక్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు నీలి నారాయణ, మేరీ జోసెఫిన్, అరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం దివాకర్‌రావు, ఉపాధ్యాయుడు రాము, సంఘ సేవకుడు రాజారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ శారద

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	:రూ.117
స్కిన్	:రూ.204
స్కిన్‌లెస్	:రూ.214

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	438.00
విజయనగరం	441.00
శ్రీకాకుళం	441.00

క్లుప్తంగా...

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

సాక్షి, పాడేరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి అధ్యక్షతన ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు వంటి జోలికి పోవద్దన్నారు. ఉన్నత చదువులపై దృష్టి పెట్టి వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థకు గురికాకుండా అవగాహన పొందాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తమ దత్తత గ్రామాల్లో గంజాయి, సారా అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎన్.రసూల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు జి.గౌరీశంకరరావు, పి.రమేష్, కానిస్టేబుల్ ఎం.గణపతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నీలవేణి, పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీవో, అధికారులు

అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు సోమవారం సమావేశమయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ రెవెన్యూ సేవలు విస్తరించాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ తదితర పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. డముకు, కాశీపట్నం సంత ఆశీలు వసూళ్లపై చర్చించారు. సచివాయాల్లో రోజు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీవో నగేష్, ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతే లక్ష్యం



నిత్యావసర సరకులు అందజేస్తున్న సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో 20 గిరిజన కుటుంబాలకు ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరకులను జి.మాడుగుల సీఐ ఎ.సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తోందన్నారు. అనంతరం గిరిజనులతో సమావేశం నిర్వహించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం, పోలీసుశాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గంజాయి, సారాకు దూరంగా ఉండాలన్నారు. గిరిజన యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రజా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

ముంచంగిపుట్టు: నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. మండలంలో గల జర్రెల పంచాయతీ కేంద్రంలో ట్రైబల్ వెల్ఫేర్ నిధులు రూ.32లక్షలతో మండల పరిషత్ పాఠశాలలో నూతన భవనాల నిర్మాణానికి ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్ భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ నేతలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా మార్చేందుకు నాడు-నేడు ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. సర్కారు బడుల రూపురేఖలు మారుస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి విశేష కృషి చేస్తోందని చెప్పారు. హెచ్‌ఎం తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, సుందర్‌రావు, రఘునాథ్, సీఆర్‌పీ గౌరీశంకర్, వార్డు మెంబర్ పరశురాం, వీఆర్‌పీ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



జర్రెలలో పాఠశాల అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సీతమ్మ

నాడు-నేడుతో పాఠశాలలు అభివృద్ధి

అనంతగిరి: కొండిబ పంచాయతీ నడిమివలస ఎంపీపీ పాఠశాలలో చేపట్టనున్న నాడు- నేడు పనులకు సర్పంచ్ కొండిబ పున్నమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ నాడు-నేడుతో పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. హెచ్‌ఎం మల్లేశ్వరరావు, సచివాలయం సిబ్బంది స్వరూప, నాగేశ్వరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నడిమివలస పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పున్నమ్మ తదితరులు

ఆత్మీయ సన్మానం



ఎంపీడీవో భాగ్యారావును సన్మానిస్తున్న సర్పంచ్‌లు, నాయకులు

డుంబ్రిగుడ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో భాగ్యారావును సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్‌లు నాగేశ్వరరావు, రామ్మూర్తి, నాయకులు సింహాచలం, శ్రీరాములు, నర్సింగ్, మహదేవ్, దేవగున్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐ రవీంద్రను సత్కరిస్తున్న మండల గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు

ముంచంగిపుట్టు: మండల గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీసా కృష్ణారావు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు తహసీల్దార్ నర్సమ్మ, ఎస్‌ఐ రవీంద్రను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. నాయకులు మాలయ్య, రామకృష్ణ, భాగత్‌రామ్, రాజుపడాల్, సత్యారావు, చినగున్నిపడాల్, బాలరాజు,నీలాబంరం తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



గామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

హుకుంపేట: గ్రామాల్లో జెడ్పీటీసీ నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. కొంతెలి గ్రామంలో ఆయన సోమవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జెడ్పీ నిధులతో కొంతెలిలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు పనులు, బోర్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం మరిన్ని నిధుల కోసం ప్రతిపాదనలు పంపించనున్నట్టు చెప్పారు.

అల్లూరికి ఘన నివాళి

అరకులోయ రూరల్/అనంతగిరి: అరకులోయ మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తిరుగుబాటు శతాబ్ది వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ సురేంద్ర మాట్లాడుతూ అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రామన్న, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేడు పాఠశాలల బంద్

అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం చేపడుతున్న బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ విద్యాలయాల నిర్వాహకులకు ఫెడరేషన్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర వ్యాప్తంగా బంద్ చేపడుతున్నట్టు నాయకులు చెప్పారు. సురేంద్ర, హరి, కార్తీక్, రఘునాథ్, డోంబ్రు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ముంచంగిపుట్టు: సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బాబూరావు, దామోదర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని గంగవరం, మొల్లేరు, నెల్లిపూడి తదితర గ్రామాల్లో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచిపెట్టి, సందడి చేశారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు

డుంబ్రిగుడ: సొవ్వ, కురిడి, గుంటగన్నెల, కొర్రాయి, పోతంగి, కొర్రా, అరమ గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ సిబ్బంది సోమవారం పర్యటించారు. మేకలు, గొర్రెలకు డీవార్మింగ్ మందుతో పాటు వ్యాక్సిన్లు వేశారు. పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. త్రినాథ్‌రావు ,మనోజ్, సంజీవ్, రాజు, రత్నం, జానకి తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: విద్యుత్ లైన్లలో జంగిల్ క్లియరెన్స్ పనుల నేపథ్యంలో మంగళవారం చింతపల్లి, జి.కె.వీధి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం నుంచి డౌనూరు వరకు, చింతపల్లి ప్రాంతంలో కూడా ఈ కార్యక్రమం చేపడుతున్నామని, ఈ కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

అనంతగిరి: మండల కేంద్రంలోని 20 రోజులుగా తాగునీటి సమస్య ఉన్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని నిరసిస్తూ మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. మండల కేంద్రంలోని గ్రావిటీ నీటి పథకం తరచూ మరమ్మతులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు స్థానికులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్‌ను కోరారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

సాక్షి, పాడేరు : కేంద్ర ప్రభుత్వం కార్మికులను నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పలు వర్గాల కార్మికులు సోమవారం పాడేరు ఐటీడీఏ ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ లేబర్‌కోడ్‌ల అమలుకు అన్ని రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులతో కేంద్ర ప్రభుత్వం సదస్సు నిర్వహిస్తోందని, దీన్ని వ్యతిరేకించాలన్నారు. కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమామహేశ్వరరావు, సుందరరావు, రాజుబాబు, అమర్, శంకరరావు, కళావతి, మోదకొండమ్మ, ముత్యాలమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమవారం సీఆర్‌పీఎఫ్-ఇ42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో పేదలకు భోజనం సమకూర్చారు. సుమారు 150 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లు అందజేసినట్టు ఇ42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.దివాకర్ చెప్పారు.

క్లుప్తంగా...

సీఎంను కలిసిన అనకాపల్లి ఎంపీ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: న్యూఢిల్లీ విమానాశ్రయంలో సోమవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అనకాపల్లి ఎంపీ సత్యవతి మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పరిస్థితిపై చర్చించారు.

ఎస్టీ, ఎస్సీ కమిటీ పర్యటనకు అరకు ఎంపీ



విశాఖ విమానాశ్రయంలో ఎంపీ మాధవి

కొయ్యూరు: ఎస్టీ, ఎస్సీ కమిటీ పర్యటనలో భాగంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి సోమవారం విశాఖ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరారు. ఆమె అక్కడ కమిటీతో కలిసి ఈ నెల 23, 24 తేదీల్లో ఊటీలో పర్యటిస్తారని ఎంపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి రామ్ తెలిపారు.

ఏటీసీ టైర్ల కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు రేపు

పెందుర్తి: అచ్యుతాపురంలోని ఏటీసీ టైర్ల కంపెనీలో 150 పోస్టులకు పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు తెలిపారు. అచ్యుతాపురం యకహోమా టైర్ల కంపెనీలో ఉద్యోగాల నిమిత్తం ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఐటీఐ పూర్తి చేసి 24 ఏళ్లలోపు యువతీ, యువకులు, డిప్లమా పూర్తి చేసిన యువతులు ఈ పోస్టులకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 92925 53352లో సంప్రదించాలని సూచించారు.

రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దండెత్తి వందేళ్లు

- రేపు అల్లూరి తిరుగుబాటు శతాబ్ది వేడుకలు
- ఆయన పోరాటం చిరస్మరణీయం

రాజవొమ్మంగి: మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు బ్రిటీషు సేనలపై చేసిన పోరాటం చిరస్మరణీయం. ఆయన గిరిజనులకు ఆరాధ్య దైవం అయ్యాడు. స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఆయన బ్రిటీషు సేనలపై తలపడే ఆ రోజుల్లో ఆత్మరక్షణకు, రణరంగంలో ఉపయోగించుకునేందుకు ఆయుధాలు అవసరమయ్యాయి. ఇందుకు ఆయన బ్రిటీషు వారి ఆధీనంలో పోలీస్ స్టేషన్లను కొల్లగొట్టడమే పరిష్కారం అనుకున్నారు. 1922 ఆగస్టు 22న చింతపల్లి స్టేషన్‌పై దాడి విజయవంతం కావడంతో వరుసగా 23న కృష్ణదేవిపేట స్టేషన్, 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడులు జరిపి ఆయుధాలను కొల్లగొట్టారు. రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై అల్లూరి దాడి జరిపి బుధవారం నాటికి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ కథనం.

అల్లూరి సీతారామరాజు రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన సమయంలో ప్రధాన అనుచరులు గాం మల్లుదొర, గంటందొర, ఎండు పడాలు, ఎర్రేసులతోపాటు విల్లంబులు చేత పట్టి ఆయన వెంట మరో మూడొందల సొంత సైన్యం పాల్గొంది. స్టేషన్లో ఆయుధాలను స్వాధీనపరచుకుని అక్కడ పనిచేస్తున్న సిబ్బంది మాటపడకుండా ఆయుధాలన్నిటినీ తానే తీసుకెళ్తున్నానని అల్లూరి వాటి జాబితా రాసి డైరీలో సంతకం పెట్టి మరీ వెళ్లారంట. ఆయన ధైర్యానికి, ధీరత్వానికి అక్కడ పోలీస్ సిబ్బంది నిశ్చేష్టులై, ఎంటువంటి అభ్యంతరం చెప్పకుండా ఆయుధాలను అప్పగించారు.

స్టేషన్లో వీరయ్యదొరను విడిపించిన అల్లూరి..

మండలంలోని లాగరాయిలో జరిగిన పితూరి నాయకుడు వీరయ్యదొర అప్పటికే పట్టుబడి స్టేషన్‌లో బందీగా ఉన్నాడు. స్టేషన్‌పై దాడి జరిగిన రోజునే అల్లూరి వీరయ్యదొరను విడిపించుకుని వెంట తీసుకెళ్లిపోయారు. ఆ తర్వాత కాలమంతా వీరయ్యదొర తన అనుచరులతోపాటు అల్లూరిని వెన్నంటి ఉండి బ్రిటీషు సేనలతో జరిపిన అనేక పోరాటాల్లో పాల్గొనడం విశేషం. ఈ విధంగా స్వాతంత్ర్య సమరంలో బ్రిటీషు సేనలతో పోరాడిన అల్లూరితోపాటు లాగరాయి, కొండపల్లి గిరిజనులు పాల్గొనడం ఈ ప్రాంత వాసులకు మరచిపోలేని ఓ అనుభూతిని ఇస్తుందనడంలో అతిశయోక్తి లేదు.



అల్లూరి దాడి జరిపిన ఆనాటి రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ భవనం

పోస్టల్ స్టాంప్‌లుగా విడుదల..

అల్లూరి పోరాట స్ఫూర్తికి మరింత వన్నె తెచ్చేలా ప్రభుత్వం ఆయా స్టేషన్లపై దాడి ఘటనలను పోస్టల్ శాఖ పోస్టల్ స్టాంప్‌లుగా విడుదల చేయడం ముదావహం. ఆయా స్టేషన్లను స్మారక చిహ్నాలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించడం విశేషం.

అల్లూరి చిత్రపటాల బహూకరణ

రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌కు, ఎంపీడీవో కార్యాలయానికి అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు సోమవారం అల్లూరి చిత్రపటాలను బహూకరించారు. రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై అల్లూరి దాడి జరిపి ఈ నెల 24వ తేదీ నాటికి నూరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ మహనీయుడిని స్మరిస్తూ చిత్రపటాలను అందజేశామన్నారు. వీరభద్రరావు సతీమణి లక్ష్మి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఎండీడీవో బాపన్నదొర, అల్లూరి యువజన సంఘం కార్యవర్గ సభ్యుడు సోమిరెడ్డి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దాట్ల వెంకటేష్‌రాజు, హెచ్‌సీ ప్రసాద్, పీసీలు సాయి, మహిళా కానిస్టేబుల్ మునిషా పాల్గొన్నారు.



రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటాన్ని బహూకరిస్తున్న పడాల వీరభద్రరావు, లక్ష్మి

గిరిజన యోధుల కుటుంబాలను ఆదుకోవాలి



అల్లూరి విగ్రహం వద్ద చీరలతో అల్లూరి యువజన సంఘం నేతలు

మంపలో అల్లూరి తిరుగుబాటు శతాబ్ది వేడుకల్లో 300 మందికి చీరల పంపిణీ

కొయ్యూరు: విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు పితూరి (పోరాటం)లో పాల్గొన గిరిజన యోధుల కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పడాల వీరభద్రావు కోరారు. అల్లూరి తిరుగుబాటు శతాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం ఆయన మంపలో అల్లూరి విగ్రహం వద్ద 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరితో కలిసి 500 మంది వరకు పోరాటంలో పాల్గొన్న వారి కుటుంబాలు నేటికీ దుర్భర స్థితిలో ఉన్నాయన్నారు. మల్లుదొర ముని మనువడు బోడి దొరను భీమవరం సమావేశంలో ప్రధాని మోదీ ప్రశంసించి చేతులు దులుపుకున్నారన్నారు. యువజన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి శ్యామల వరలక్ష్మి అల్లూరి ఫొటోలను పంపిణీ చేశారు. సంఘం నేతలు మాకాడ బూర్గులయ్య, సిహెచ్ శివన్నారాయణ, లక్కాకుల బాబ్జీ, మాజీ సర్పంచ్ రాజుబాబు, కార్యదర్శి బి. పవన్, వార్డు సభ్యులు లక్ష్మి, నూకరాజు పాల్గొన్నారు.

విజయవాడ కనకదుర్గకు పసుపు కుంకుమ సమర్పణ



విజయవాడలో పసుపు కుంకుమ సమర్పిస్తున్న అనకాపల్లి కనకదుర్గ అమ్మవారి కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: ఏటా దసరా ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ అమ్మవారికి గవరపాలెం కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు సోమవారం పసుపు కుంకుమ సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు పి.వి.రమణ మాట్లాడుతూ కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా పసుపుకుంకుమ అందజేశామన్నారు. కమిటీ సభ్యులు కాండ్రేగుల నాయుడు, పాలిమేర శ్రీను, సూరిశెట్టి నర్సింగరావు పాల్గొన్నారు.

జనం పాటే జానపదం



కళాకారులను సత్కరిస్తున్న వంగపండు ఉష, అనూషా పట్నాయక్



జానపద నృత్యం చేస్తున్న చిన్నారులు



పాటలు పాడుతున్న అసిరయ్య

- ఏపీ భాషా సాంస్కృతిక మండలి చైర్‌పర్సన్ వంగపండు ఉష

సీతంపేట (విశాఖ ఉత్తర): జానపద కళలను కాపాడుకుందామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక మండలి చైర్‌పర్సన్ వంగపండు ఉష అన్నారు. స్నేహాంజలి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా పరులుగా పేరుగాంచిన మాతా రికార్డింగ్ సెంటర్ అధినేతలు పల్లి నాగభూషణం, బిన్నాల నరసింహమూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంగపండు ఉష మాట్లాడుతూ రైతన్నలు ఆరుగాలం పండించిన పంటలు కోసేటపుడు, బిడ్డకు తల్లి అన్నం తినిపించేటపుడు ఆలపించే గీతాలే అసలైన జానపదాలన్నారు. తన తండ్రి వంగపండు ప్రసాదరావు ఎక్కడ ప్రజలకు మేలు జరుగుతుందంటే అక్కడ జానపదంతో వారికి అండగా నిలిచేవారని గుర్తు చేశారు. ఆ రోజుల్లో కనీసం వాయిద్య పరికరాలు కూడా లేవని, కేవలం అగ్గిపెట్టెతో సంగీతం సమకూర్చుకుని ఆలపించేవారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు అన్ని విధాల అండగా నిలుస్తోదన్నారు. గత ఏడాది అవార్డులు అందించి ఎంతో మందిలో స్ఫూర్తి నింపిందన్నారు. శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కంటి మహంతి అనూషా పట్నాయక్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా జానపదాల గొప్పతనం భావితరాలకు తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా వంగపండు ఉష, జానపద కళాకారుడు అసిరయ్య ఆట, పాటలతో అలరించారు. స్నేహాంజలి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వి.ఎస్.మూర్తి సారథ్యంలో జరిగిన ఈ జీవీఎంసీ కార్యదర్శి పల్లి నల్లనయ్య పాల్గొన్నారు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్ షిప్‌లో తృతీయ స్థానం



జీవన్ కుమార్

పాయకరావుపేట: స్థానిక పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న విశ్వనాథ్ కుమారుడు జీవన్‌కుమార్ జాతీయ సబ్ జూనియర్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్ షిప్‌లో తృతీయ స్థానం సాధించాడు. ఈ నెల 19న ఉత్తరాఖండ్ కరైంగిలో ఇందిరాగాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం చంద్రమ్మపాలెం(మధురవాడ) ఎంపీపీ పాఠశాలలో జీవన్ కుమార్ పదో తరగతి చదువుతున్నాడు.

బ్లూటిఫుల్ పిక్చర్



రైవాడ జలాశయం పరిసరాలలో ప్రకృతి అందాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చుట్టూ కొండలు, దిగువున పచ్చని పంట పొలాలు. సుందర దృశ్యాలను చూసి ప్రకృతి ప్రేమికులు పరవశించిపోతున్నారు. సోమవారం సాయంత్రం నింగిలోని నీలిమేఘాలు జలాశయంలో జలకాలాడుతున్నట్లు సాక్షాత్కరించింది.

-దేవరాపల్లి (మాడుగుల)

భవితతో భరోసా

- ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రత్యేక శిక్షణ, వైద్యం
- పిల్లల్లో మెరుగుపడుతున్న నైపుణ్యాలు
- భవిత కేంద్రాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పెందుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా..ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'ప్రత్యేకావస రాల' పిల్లల భవిష్యత్‌కు భరోసా కలుగుతోంది. భవిత కేంద్రాల్లో ఆయా పిల్లలకు ప్రత్యేక శిక్షణ, చికిత్స ద్వారా వారి సహజసిద్ధమైన నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నారు. వారి పనులు వారే చేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు. అయితే లోపాలు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం..భవిత కేంద్రాలు ఉన్నట్లు తగిన ప్రచారం చేయకపోవడం వలన పిల్లలను తీర్చిదిద్దే అవకాశాలు చేజారుతున్నాయి. ఒక్క పెందుర్తిలోనే దాదాపు 200 మందికి పైగా లోపాలు కలిగిన పిల్లలు ఉండగా నియోజకవర్గంలో ఆ సంఖ్య వెయ్యికి పైమాటే..కానీ భవిత కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న పిల్లల సంఖ్య కేవలం 70 మంది మాత్రమే. ప్రత్యేకావసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో సంప్రదించవచ్చు.

లోపాలు ఇవీ.. శిక్షణ ఇలా..

- ముందుగా కేంద్రంలో చేరిన చిన్నారులను కొద్దిరోజుల పాటు నిపుణులు ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా పరిశీలించి వారి లోపాలను గుర్తిస్తారు.
- దృష్టిలోపం ఉన్నవారికి దృష్టి ప్రేరణ, బ్రెయిలీ లిపిపై అవగాహన కలిగిస్తారు.
- వినికిడి సమస్య ఉన్నవారికి నాలుక అంగుడికి మధ్య ప్రేరణ కలిగేలా తర్ఫీదు ఇస్తారు. కొవ్వొత్తులు ఊదించడం..బెలూన్లు ఊదడం..ఐస్ క్రీం తినిపించడం వంటివి ఇందులో భాగం. దీంతోపాటు ప్రత్యేక పరికరం ద్వారా వారి వినికిడి సమస్యను పరిష్కరించేందుకు చికిత్స అందిస్తారు.
- మానసిక సమస్యలు ఉన్న పిల్లలను ఏదైనా ఓ పని మీద ఆసక్తి కలిగేలా చేస్తారు. ఈ పిల్లల్లో త్వరగా మరిచిపోయే లక్షణం ఉంటుంది కనుక ఆ పని మీద ఆసక్తిని కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. తరచూ ఆటలను మారుస్తూ మానసిక స్థితిని కేంద్రీకృతం చేసేందుకు ప్రయత్నం చేస్తారు.
- లోపాలు గుర్తించి పిల్లలకు కేంద్రంలోనే శిక్షణ కాకుండా ఇంటి దగ్గర కూడా సాధన చేసే విదంగా భోదన చేస్తారు. తల్లిదండ్రులకు కూడా మెళకువలు నేర్పిస్తారు.
- పిల్లల లోపాలను బట్టి భవిత కేంద్రంలో కనీసం మూడు నెలలు గరిష్టంగా రెండేళ్లపాటు శిక్షణ, చికిత్స అందిస్తారు.
- పరిస్థితి మెరుగైనట్టు ఉంటే పిల్లలకు అందుబాటులో ఉండే పాఠశాలలో చేర్పించి సహిత విద్య అందించే ప్రయత్నం చేస్తారు.



పిల్లలకు మెళకువలు చెబుతున్న భవిత కేంద్రం నిర్వాహకురాలు శారద



భవిత కేంద్రంలో ఆటలాడుకుంటున్న మానసిక, దివ్యాంగ పిల్లలు



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు

'భవిత'లో ఇలా చేర్పించండి

- సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో పెందుర్తి, సబ్బవరం, పరవాడల్లో భవిత కేంద్రాలు నడుస్తున్నాయి. ఒక్కో కేంద్రంలో 20 మంది చొప్పున ప్రవేశాలు కల్పిస్తారు.
- నెలల చిన్నారి నుంచి 18 ఏళ్లలోపు పిల్లలు అర్హులు.
- మిత వైకల్యం, అతి తక్కువ ఉన్న పిల్లలకు కేంద్రంలో ప్రతీరోజు శిక్షణ అందిస్తారు. తీవ్ర, అతి తీవ్ర వైకల్యం ఉన్నవారికి ఇంటి దగ్గరే తర్ఫీదు ఇస్తారు. లోపాలు ఉన్న పిల్లలతో పాటు తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్, గైడెన్స్ ఇస్తారు. తద్వారా ఇంటి నిపుణులు లేని సమయంలో కూడా పిల్లలకు తల్లిదండ్రులు శిక్షణ ఇచ్చుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకుల భావన.


అడ్మిషన్లు ఇస్తున్నాం



భవిత కేంద్రాల్లో పిల్లల పరిస్థితికి అనుగుణంగా శిక్షణ, చికిత్స అందిస్తున్నాం. పిల్లలందరూ చక్కాగా స్పందిస్తున్నారు. కనీసం వారి పనులు వారు చేసుకునేలా తీర్చిదిద్దడమే మా కర్తవ్యం. అయితే చాలామంది తల్లిదండ్రులు ఇక్కడి కేంద్రంపై అవగాహన లేక బయట ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ చేరే పిల్లలకు నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్/పింఛన్‌తో పాటు గార్డియన్‌కు బస్‌పాస్ సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. తమ పిల్లలను చేర్పించాలనుకునే వారు ఫోన్: 99122 39821 నంబర్లో సంప్రదించినా.. కేంద్రానికి వచ్చినా అడ్మిషన్ ఇస్తాం.

-ఎస్.శారద, భవిత కేంద్రం నిర్వాహకురాలు

అక్కడమ్మాయి.. ఇక్కడబ్బాయి




అమెరికాలో హిందూ సంప్రదాయం ప్రకారం జరిగిన వీరి వివాహం

- జర్మనీ యువతితో విశాఖ యువకుడి పెళ్లి
- మూడుముళ్లు వేసింది అమెరికాలో..
- ప్రేమించి..పెద్దలను ఒప్పించి వివాహం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ప్రేమకు కులం, మతం, భాష, ప్రాంతం వంటి బేధాలేవీ ఉండవు అంటారు. ఖండాంతరాలు దాటైనా ప్రేమను గెలిపించుకుంటున్నారు ప్రేమికులు. ఇవన్నీ వినడానికి సినిమా డైలాగుల్లా అనిపించొచ్చు.. కానీ అప్పుడప్పుడు రియల్ లైఫ్ లోనూ ఇలా జరుగుతుంటాయి. తాజాగా ఓ జంట ప్రేమ ఖండాంతరాలు దాటింది. విశాఖ అబ్బాయి..జర్మనీ అమ్మాయిని ప్రేమించి పెద్దలను ఒప్పించి ఒక్కటయ్యారు.

ఇక్కడ విశేషమేమిటంటే..మూడు దేశాల సంబంధంతో ఓ జంట ఒక్కటయ్యింది. వివరాల్లోకి వెళ్తే..విశాఖలోని కళాసాగర్ అధినేత వానపల్లి శ్రీమన్నారాయణ కుమారుడు దైవిక శశాంక్, జర్మనీకి చెందిన లిండా ముల్లర్ ప్రేమించుకున్నారు. ఈ విషయం



పెద్దలకు చెప్పడం..వాళ్లు అంగీకరించడంతో ఇటీవల వీరి వివాహం అమెరికా (అమ్మాయి, అబ్బాయి అక్కడ పనిచేస్తున్నారు)లో అంగరంగ వైభవంగా..హిందూ సంప్రదాయం ప్రకారం జరిగింది. అబ్బాయిది (విశాఖ),అమ్మాయిది(జర్మనీ), పెళ్లయ్యింది అమెరికాలో.. ఫలితంగా ఈ వివాహ బంధం మూడు దేశాలతో ముడిపడినట్టయ్యింది.

పదేళ్ల కృషి సాగు ఖుషీ

- ఉప్పునీటిని మంచి నీరుగా మార్చిన రైతు సూరిబాబు
- వ్యవసాయంపై మొగ్గుచూపుతున్న రైతులు



పాత మూలకుద్దు వద్ద ఉప్పునీటి స్థానంలో నిండుగా కనిపిస్తున్న మంచినీరు

తగరపువలస (భీమిలి): భీమిలి మండలం చిప్పాడ పంచాయతీకి చెందిన యువరైతు వెంపాడ సూరిబాబు పదేళ్ల కృషి ఫలించింది. తాటిపూడి రిజర్వాయర్ నుంచి గోస్తనీనది ద్వారా ఉప్పుగెడ్డలో కలుస్తున్న నీటిని నిలువరించాడు. గోస్తనీనది నుంచి మొదటి పాయ నేరుగా తగరపువలస జాతీయ రహదారి వంతెన కింద నుంచి గుడివాడ, చిట్టివలస మీదుగా ఉప్పుటేరులో కలిసిపోగా, రెండవ పాయ మజ్జివలస, తాటితూరు మీదుగా పోలిపల్లి కాలువ ద్వారా పాత మూలకుద్దు, చిప్పాడ పంచాయతీల మీదుగా ప్రవహిస్తోంది. ఇది చెరకుపల్లి– దివీస్ రోడ్డులో మూలకుద్దు, చిప్పాడ పంచాయతీల నడుమ ఉప్పుగెడ్డ వంతెన వద్ద ఉప్పునీటిలో కలిసిపోతోంది. సముద్రంలో రోజుకు రెండుసార్లు సంభవించే ఆటుపోట్లు కారణంగా సిటీనగర్‌ను ఆనుకుని ఉన్న దేవరమెట్ట నుంచి తగరపువలస వైపు ఉన్న రెండు పాయల వైపు బోరుబావులు, నదులు ఉప్పుగా మారిపోయాయి. ఫలితంగా పంట పొలాలు చౌడుగా మారిపోయాయి. ఈ ప్రాంతంలో వేసిన లే ఔట్లులో ఉప్పునీరు పడటంతో నివాసానికి పనికిరాకుండా పోయాయి.

పట్టువదలని విక్రమార్కుడిలా..

పదోతరగతి చదువుకున్న సూరిబాబు తనకున్న మూడు ఎకరాలు, బంధువుల నుంచి కౌలుకు తీసుకున్న 17 ఎకరాలతో సాగు చేస్తున్నాడు. సాగునీటి కోసం వర్షాలపై ఆధారడమే కాకుండా కొండవాలులో కురిసిన నీటిని ఒడిసి పట్టి బావులలో నిల్వ చేస్తుంటాడు. అయినప్పటికీ సాగునీరు చాలకపోతుండటంతో గోస్తనీ నీటిని ఉప్పుగెడ్డలో కలవకుండా, సముద్రం నీరు ఆటుపోట్లతో నది నీటిలో కలపకుండా అడ్డుకట్ట వేయగలిగాడు. మట్టి, గ్రావెల్, పైపులు ఉపయోగించిన చేసిన ప్రయత్నం మూడు సార్లు విఫలమయినా నాలుగోసారి విజయం సాధించాడు. దీనికి సూరిబాబు రూ.5లక్షల వరకు ఖర్చు చేశాడు. తాను ప్రయోజనం పొందడమే కాకుండా తోటి రైతులకు మేలు చేయగలిగాడు. చిప్పాడ పంచాయతీలో 300 ఎకరాల వరకు కొబ్బరి, నీలగిరి, అరటి, చోడి, ఉలవలు సాగు చేస్తుంటారు. గతంలో ఉప్పునీరు కారణంగా పంటలకు స్వస్తి చెప్పిన రైతులు మళ్లీ పంటలవైపు మొగ్గ చూపుతున్నారు.

మూడు సార్లు విఫలమయ్యా



గోస్తనీనది నుంచి నీరు ఉప్పుగెడ్డలో కలవకుండా చేసేందుకు మూడు సార్లు ప్రయత్నించి విఫలమయ్యా. ఏడాది క్రితం నుంచి ఈ ప్రాంతంలోని భూములలో నీటి రుచి మారుతూ వస్తోంది. ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు ఖర్చయింది. గతంలో ఉప్పుగా ఉన్న చోట నీరు ఇప్పుడు మంచినీరుగా వస్తోంది.

-వెంపాడ సూరిబాబు, చిప్పాడ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, భీమిలి మండల

మట్టితో చెక్‌డామ్‌ల నిర్మాణం..



సిటీనగర్ దేవరమెట్ట వద్ద నిర్మించిన మట్టి చెక్‌డ్యామ్

స్వతహాగా రైతు అయిన వెంపాడ సూరిబాబు పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నాడు. చిప్పాడ కొండవాలు ప్రాంతంలో ఉన్న తన వ్యవసాయ భూములు పదేళ్ల క్రితమే ఉప్పునీటి కారణంగా చౌడువారిపోయాయి. మరో రైతు అయితే వ్యవసాయం మానుకుని వెన్నుచూపేవాడే. కానీ సూరిబాబు కొండ ప్రాంతంలో కురిసిన వర్షం నీటికి కందకాలు తవ్వి సాగుకు అవసరమయ్యే నీటిని బావులలో నిలువ చేసుకోగలిగాడు. అప్పట్లో సూరిబాబు ప్రయత్నాన్ని చూసి నవ్వుకున్నవారే ఇప్పుడు ఆయన ఉప్పునీటి కోరల్లో చిక్కకుండా మంచినీటిని పరిరక్షించిన విధానాన్ని చూసి అభినందిస్తున్నారు. ఉప్పుగెడ్డకు చేరువలో చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల నడుమ, దేవరమెట్ట గ్రామ సచివాలయానికి చేరువలో రెండు చోట్ల మట్టి, సిమెంట్ పైపులు వినియోగించి కొంచెం ఎత్తులో చెక్‌డ్యామ్‌లు నిర్మించాడు. దీంతో ఆటుపోట్ల ద్వారా ఉప్పునీరు ఎగువకు చేరకుండా, గోస్తనీనీరు దిగువకు చేరకుండా నిరోధించగలిగాడు. రెండేళ్లుగా సొంత ఖర్చుతో చేస్తున్న ప్రయోగం కారణంగా మూలకుద్దు, చిప్పాడ పంచాయతీలలో వ్యవసాయబావులు, బోరు బావులలో నీరు ప్రస్తుతం చప్పగా మారిపోయింది. చౌడువారిన భూములు మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. లే ఔట్లలో ప్రస్తుతం చప్పనీరు లభిస్తుంది. గతంలో నిలిచిపోయిన వ్యవసాయం మళ్లీ ఊపందుకోనుంది.

300కు పైగా బోర్లలో మంచినీరు..

గతంలో ఉప్పునీరు, కలుషితమైన నీటితో నిండిపోయిన తాగునీటి, సాగునీటి బావులలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో 300 పైగా బోర్లలో మంచినీరు చేరింది. చౌడువారిన తోటపంటలు జీవం పోసుకుంటున్నాయి. మళ్లీ చిప్పాడ, మూలకుద్దు పంచాయతీల రైతులు వ్యవసాయం వైపు మొగ్గ చూపుతున్నారు.



-సరగడ రాంబాబు, చిప్పాడ

ప్రభుత్వం చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి..



ఉప్పునీరు ఎగువకు చేరకుండా ప్రభుత్వం లేదా ఇక్కడి వనరులు వినియోగించుకుంటున్న దివీస్ యాజమాన్యం శాశ్వత ప్రయోజనాల కోసం చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. కొండలపై కురిసిన నీరు కూడా నిల్వ చేయవచ్చు. ఇలా చేస్తే ఏడాది పొడవునా తాగు, సాగునీరు ఇక్కడి ప్రజలకు సరిపోతుంది.

-కొసన ఈశ్వరరావు, చిప్పాడ

మీకు తెలుసా? జీబ్రాలు నిలబడే నిద్రపోతాయి



విశాఖపట్నం: జంతువులు అన్ని రంగులను ఆసక్తిగా చూస్తుంటాయి. వాటి చూపును బట్టి ఆయా రంగులను గుర్తిస్తున్నాయని మనం భావిస్తాం. జీబ్రాలు మాత్రం పచ్చని రంగును గుర్తించలేవట. కానీ ఒకేసారి వాటి కంటితో రెండు దృశ్యాలను చూడగలవట. ఈ విషయం వన్యప్రాణుల సంరక్షణ చేసేవారికి మాత్రమే తెలుస్తుంటుంది. ఇంకా వాటి గురించి తెలుసుకోవాల్సిన ఆసక్తిగల విషయాలు ఉన్నాయండోయ్.. జీబ్రాలు అడవుల్లో సుమారు 1,000 వరకు గుంపులుగా తిరుగుతాయి. అవి గంటకు 40 కిలోమీటర్లు వేగంతో పరుగెత్తుతాయి. ఇవి తిన్నగా కాకుండా అడ్డదిడ్డంగా పరుగెడుతాయట. అందుకే వేటగాళ్లకు ఇవి దొరకవట. ఒకవేళ వేటగాళ్లుగానీ, హైనా, సింహం తదితర క్రూర మృగాలుగానీ వాటిని వేటాడినప్పుడు వెనుక కాళ్లతో తన్ని వాటిని అవే రక్షించుకొంటాయి. పిల్ల జీబ్రా కూడా పుట్టిన గంటకు పరుగెడుతుందట. వీటిలో మరో విశేషమేమంటే ఇవి నిలబడే నిద్రపోతాయి. ఏ రెండు జీబ్రాలకు వాటి శరీరంపై ఉన్న చారలు ఒకేలా ఉండవు. ఇవి వాటిపై దాడిచేసే క్రూర మృగాలను తికమకపెడతాయట.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఓం నమః శివాయ నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

వైభవంగా నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా చేశారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందజేశారు.